
జూలై - ఆగష్టు, 2009
స్పర్శ
ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక
ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి,
క్రీస్తు మనలను స్వతంత్రులనుగా
చేసియున్నాడు.



# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

యేసుక్రీస్తు నామములో స్పర్శ పాఠకులకు నా హృదయపూర్వక వందనములు. ప్రభువు మిమ్ములను, మీ కుటుంబములను గడిచిన ఆరు నెలలు కాపాడి, ఆయన సురక్షితమైన రెక్కల నీడలో ఉంచి నడిపిస్తున్నందుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను.

అంత్యదినములలో దేవుడు తన పని కొరకు నిస్వార్థముగా జీవించే సహోదర, సహోదరీలను అనుగ్రహించుట మన ధన్యత. మీరు నాకు బహుప్రియులై ఉంటిరి గనుక దేవుని సువార్తను బోధించుట మాత్రమే కాక, నా ప్రాణమును కూడా ఖర్చుచేయుటకు వెనుతీయుట లేదు. అనగా కొందరిని ఏ విధము చేతనైననూ అగ్నిగుండము నుండి తప్పించవలెనని ఉద్దేశ్యము.

పిల్లలకు పరీక్షలలో దేవుడు అనుగ్రహించిన జయములను బట్టి దేవునికి స్తోత్రములు, ప్రార్థించిన మీకు నా వందనములు. మరల క్రొత్త విద్యాసంవత్సరములో మన యౌవనస్థుల యొక్క చదువులలో ప్రత్యేక జ్ఞానమును దయచేయును గాక ! చదువులలోనే కాక ఆధ్యాత్మికతలో కూడా ఒక శ్రేష్ఠమైన భవిష్యత్తు కలగాలని ప్రార్థన చేద్దాము.

మనము ప్రార్థించిన విధముగానే రాష్ట్రములోనూ, దేశములోనూ సుస్థిర ప్రభుత్వములను దేవుడు ఇచ్చినందుకు స్తోత్రము. సర్వేలు హంగ్ ప్రభుత్వము వస్తాయని ఎంత ఘోషించిననూ దేవుడు ఆయన సంకల్పమును జరిగించినందుకు కృతజ్ఞతాస్తుతులు. మన దేశము ఆర్థిక మాంద్యము నుండి త్వరగా కోలుకోవాలని, తద్వారా దేశ ప్రజల ఆర్థిక స్థితి గతులు మెరుగుపడాలని దేవుని వేడుకుందాము.

63వ స్వాతంత్ర్య దినోత్సవము జరుపుకోవడానికి సిద్ధమవుతున్న మన దేశము లో అనేక సమస్యలతో సతమతమౌతున్నాము. అంతర్గత భద్రత, స్వార్ధ రాజకీయాలు తద్వారా అవినీతిమయమైన వ్యవస్థ, వీటి ఫలితం సామాన్య మానవుని జీవనానికి ఏ మాత్రమూ భరోసా లేని పరిస్థితి. ఈ రుగ్మతల నుండి విడుదల లభించడం దేశానికి నిజమైన స్వాతంత్ర్యము. వీటి కొరకు ప్రార్థన చేద్దాము.

పరిచర్యను ప్రేమించి, ప్రోత్సహిస్తూ, నా బాధ్యతలలో భాగస్థులుగా ఉన్న మీకు నా ప్రత్యేకమైన వందనములు.

దేవుడు మిమ్మును దీవించును గాక !

మీ సహోదరుడు....

జూలై - ఆగష్టు, 2009

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- బంధకములు ........ 2
- భయభక్తులు ........ 4
- సలహా (స్త్రీల ప్రత్యేకం) ........ 5
- కిటికి (Window) ........ 8
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 5వ భాగము ........ 9
- ఓటమి-గెలుపు (బాలల శీర్షిక) ........ 11
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 12
- ఇది తెలుసా? ........ 14
- ఆతిథ్యము ........ 15
- ఆత్మఫలము ........ 17
- హోరేబు పర్వతము ........ 18
- బైబిల్ క్విజ్-5 ........ 19
- జన్మదిన శుభాకాంక్షలు ........ 20


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# బంధకములు

- బ్రదర్. ఎపఫ్రా

**బంధకములలో పడియుండియు నిరీక్షణ గల వారలారా, మీ కోటను మరల ప్రవేశించుడి, రెండంతలుగా మీకు మేలు చేసెదనని నేడు నేను మీకు తెలియజేయుచున్నాను.** జెకర్యా 9:12

మన జీవితములో ఆర్థిక పరిస్థితులు, వ్యాధులు, పాపము, మనుష్యుల ద్వారా బంధకములలో చిక్కుకుంటూ ఉంటాము. పరిస్థితులను బట్టి మనము ఎటువంటి బంధకములలో చిక్కుకున్ననూ, వాటన్నిటి నుండి విడిపించి, మనకు మేలు చేయాలనే దేవుని ఉద్ధేశ్యము. అయితే ఈ బంధకములలోనే మనము దుఃఖిస్తూ, నిరాశలలో జీవించక దేవుని యందు నిరీక్షణను కలిగి ఉండుట ద్వారా రెండంతలు మేలు చేసెదను అని దేవుని వాక్యము సెలవిచ్చుచున్నది.

**షద్రకు, మేషాకు, అబెద్నగో అను యౌవనస్తులకు కలిగిన బంధకములు:**

యూదా రాజ్యము నుండి బబులోనుకు కొనిపోబడి బబులోను సంస్థానము మీద విచారణ కర్తలుగా నియమించబడిరి. అంతలో బబులోను రాజైన నెబుకద్నెజరు ప్రతిమను ఒకటి చేయించి దాని ఎదుట సాగిలపడి నమస్కరించవలెనని, నమస్కరింపని వాడెవడో వాడు మండుచున్న అగ్నిగుండములో తక్షణమే వేయబడును అనే శాసనం చేయుట జరిగినది. అప్పుడు ఆ దేశ జనులు, ఆయా భాషలు మాట్లాడు వారు సాగిలపడి నమస్కారము చేసిరి. షద్రకు, మేషాకు, అబెద్నగో అనువారు మాత్రము ఆ ప్రతిమకు నమస్కారము చేయము అని అనుటద్వారా అగ్ని గుండము అనే బంధకములో చిక్కుకున్నారు.అయిననూ ఆ బంధకములో వారు ధైర్యమును కోల్పోలేదు, నిరీక్షణను విడిచిపెట్టలేదు. మేము సేవించుచున్న దేవుడు మండుచున్న వేడిమి గల అగ్ని గుండము నుండి మమ్మును తప్పించి, రక్షించుటకు సమర్థుడు, మరియు నీ వశమున పడకుండ ఆయన మమ్మును రక్షించును. ఒకవేళ ఆయన రక్షింపక పోయిననూ ! రాజా ! నీవు నిలువ బెట్టించిన బంగారు ప్రతిమకు నమస్కరింపము. దాని 3: 17,18 అని రాజుకు ప్రత్యుత్తరమిచ్చిరి.



వారు చిక్కుకున్న బంధకములో దేవుడు రక్షిస్తారు, రక్షించకపోయిననూ ఆ బంధకమునకు తలవంచక, వారి దేహములను అప్పగించటానికి కూడా వెనుతీయలేదు. వారి నిరీక్షణను దేవుడు సిగ్గుపరచలేదు. తలవెంట్రుకలకైననూ, వస్త్రములకైననూ అగ్ని వాసన అంటలేదు. దేవుడు అగ్ని గుండములోనికి తన దూతను పంపించి వారిని విడిపించారు. వారి యొక్క బంధకములలో కలిగియున్న నిరీక్షణను బట్టి ఆ అగ్నిగుండము నుండి తప్పించుట ఒక మేలైతే , రాజు షద్రకు, మేషాకు, అబెద్నగోలు సేవించుచున్న దేవుడే పూజార్హుడు అని రాజ్యమంతటా చాటించి వారిని హెచ్చించి, శ్రేష్ఠులుగా నిలిపి ఉంచుట రెండవ మేలు.



**2. ప్రవక్తయైన యోనాకు కలిగిన బంధకము:**

యోనా అను ప్రవక్తను దేవుడు నీనెవె పట్టణమునకు వెళ్ళమని చెప్పినప్పుడు తర్షీషు వైపుకు బయలుదేరి వెళ్ళుచున్నాడు. దేవుడు చెప్పిన మాట వినక, తిరుగుబాటు స్వభావముతో ప్రవర్తించి బంధకములో చిక్కుకున్నాడు. అప్పుడు దేవుడు సముద్రము మీద పెద్ద గాలిని పుట్టించగా ఓడ బద్దలై పోవు గతికి వచ్చెను. అప్పుడు యోనా నన్ను బట్టియే ఈ గొప్ప తుఫాను అని తెలుసుకొనెను. యోనాను సముద్రములో పడవేయగా, చేపకు దేవుడు ఆజ్ఞ ఇచ్చినపుడు చేప యోనాను మ్రింగెను. అతడు మూడు దినములు మత్స్యము కడుపులో బంధకములలో చుట్టబడి, ఒక నిరీక్షణ కలిగిన ప్రార్థన చేసాడు. యోనా చేప కడుపులో ఉండి చేసిన ప్రార్థన ద్వారా ఆ బంధకము నుండి విడిపించబడి నీనెవె పట్టణమునకు వెళ్ళి అక్కడి ప్రజలతో దేవుని మాటను చెప్పాడు.



మొదటే యోనా దేవుని మాటని విని ఉంటే బంధకములో చిక్కుకుని ఉండేవాడు కాదు, చేప కడుపులో ఉండవలసిన పరిస్థితి కలిగేది కాదు. మాట వినని స్వభావము బంధకములో చిక్కుకునేలా చేసింది. బంధకముల వలన కలిగిన బాధ అతని హృదయములో పశ్చాత్తాపమును, నిరీక్షణను కలిగించింది.



మనము ఒక్కొక్కసారి ఆయన ఆజ్ఞను మీరి బంధకములలో చిక్కుకుని ఉండవచ్చు, అంత మాత్రము చేతనే నేను ఇంక దేనికీ పనికి రాను అనే ఆలోచనలలోకి వెళ్ళక ఈ బంధకములలోనే నేను నిరీక్షణ కలిగి జీవిస్తాను అనే తీర్మానము దేవునిలో మనల్ని ముందుకి నడిపిస్తుంది.

మన జీవితములో బంధకములు కలిగినప్పుడు దేవుని సన్నిధికి వచ్చి, వాక్యము వింటూ ఆలోచనా, ప్రవర్తనా విధానములలో మార్పు తెచ్చుకొని, నిరీక్షణతో ప్రార్థన చేసేవారిగా ఉండాలి. మన బంధకములలో ప్రభువైన దేవునిని మాత్రమే జ్ఞాపకము చేసుకోవాలి. ఆయన సజీవుడైన దేవుడు కనుక మనకు సహాయం చేయగలడు. మన పరిస్థితి ఎంత దిగజారిపోయిననూ నిరీక్షణ కలిగి ఉంటే బంధకముల నుండి విడిపించబడతాము. తద్వారా బంధకములలో ఉన్న అనేకులకు మాదిరిగా జీవించగలుగుతాము .

ప్రియమైన వారలారా! మనము ఏ విధమైన బంధకములలో చిక్కుకొని యున్నామో గ్రహించుకొని, ఎట్టి బంధకము లోనైన నిరీక్షణ కలిగి జీవిస్తాను అనే తీర్మానము ద్వారా బంధకముల నుండి విడిపించబడి దేవుని నుండి రెండంతల మేలు పొందగలము.



# భయభక్తులు

**యెహోవా యందు భయభక్తులు కలిగి ఉండుట:**

1. జ్ఞానమునకు మూలము – సామె 9:10
2. తెలివికి మూలము – సామె 1:7
3. చెడుతనము నసహ్యించుకొనుట – సామె 8:13
4. దీర్ఘాయువునకు కారణము – సామె 10:27
5. యదార్థముగా ప్రవర్తించువాడు – సామె 14:2
6. బహుధైర్యము పుట్టించును – సామె 14:26
7. జీవపు ఊట – సామె 14:27
8. జీవసాధనము – సామె 19:23
9. వినయము, ఐశ్వర్యము, ఘనత, జీవము – సామె 22:4
10. స్త్రీ కొనియాడబడును – సామె 31:30
11. జ్ఞానాభ్యాసమునకు సాధనము – సామె 15:33
12. ఆయన దాచి ఉంచిన మేలు ఎంతో గొప్పది – కీర్తన 31:19
13. ఆయన దృష్టి నిలుచును – కీర్తన 33:19
14. ఏమియు కొదువలేదు – కీర్తన 34:9
15. ఆయన దూత కావలి ఉండి వారిని రక్షించును – కీర్తన 34:7

# సలహా

- సిస్టర్ వి. విజయ

కుటుంబమును శ్రేష్ఠమైన స్థితిలోకి నడిపించ గలిగేది ఒక మంచి సలహా. మనకి ఏదైనా చేయాలనిపిస్తే అది మంచిదో, కాదో ఒక అవగాహన చేసుకోలేని సమయములలో ఎవరినైననూ సలహా అడిగితే మంచిది అనిపిస్తుంది. మంచి సలహా మనలను దేవుని ఉద్దేశములలో నిలిపి ధైర్యము కలిగించి, ప్రోత్సాహ పరుస్తుంది. కుటుంబములో మాదిరిగా ఉంచి, శ్రేష్ఠులుగా నిలుపుతుంది. చెడ్డ సలహా దేవుని ఉద్దేశ్యములను నెరవేర్చనిదిగా, ప్రోత్సాహ పరచనిదిగా, కుటుంబమును తప్పు మార్గములలో నడిపించేదిగా ఉంటుంది.

బైబిల్ గ్రంథమును పరిశీలించినపుడు మంచి సలహాలు ఇచ్చి కుటుంబములో దేవుని సహాయమును పొందిన వారు, చెడ్డసలహా ఇచ్చి భర్తను కోల్పోయిన స్త్రీ, భర్త చెప్పిన మాటకు సలహా ఏమీ చెప్పక,చెడు మార్గము అనుసరించి, ప్రాణములు కోల్పోయిన వారు కలరు.

**1.** ఆమె తన పెనిమిటిని చూచి మన యొద్దకు వచ్చుచు పోవుచున్న వాడు భక్తిగల దైవజనుడని నేనెరుగుదును. కావున మనము అతనికి గోడ మీద ఒక చిన్న గది కట్టించి, అందులో అతని కొరకు మంచము, బల్ల, పీట దీపస్తంభము నుంచుదము. అతడు మన యొద్దకు వచ్చు నప్పుడెల్ల అందులో బస చేయవచ్చునని చెప్పెను. (2 రాజులు 4:9,10)

షూనేము అను పట్టణములో ఘనురాలైన ఒక స్త్రీ కుటుంబము ఉండేది. ఆమె పేరు వ్రాయబడలేదు కనుక షూనేమీయురాలైన స్త్రీ అని చెప్పబడినది. దేవుని ప్రవక్త అయిన ఎలీషా షూనేము పట్టణమునకు వచ్చినప్పుడెల్ల ఘనురాలైన ఆ స్త్రీ భోజనమునకు రమ్మని బలవంతము చేసెను గనుక అతడు ఆ మార్గమున వచ్చినప్పుడెల్ల ఆమె ఇంట భోజనము చేయుచూ వచ్చెను. తరువాత ఆ దైవజనుని యొక్క గుణలక్షణములను గమనించిన ఆ స్త్రీ అతను మంచి ప్రవక్త అని ఎరిగి, ఆమె భర్తకు ఒక మంచి సలహా నిచ్చి దైవ జనుని కొరకు గదిని ఏర్పాటు చేయించెను. దైవజనుడైన ఎలీషా ఆ యింట బస చేయుచూ వచ్చెను. అప్పటికి ఆమెకు సంతానము లేదు. ఎలీషా ప్రవక్త ఆమె వారి యందు కనుపరిచిన శ్రద్ధాభక్తులను బట్టి ఆమెకు ఏమైనా కొదువ ఉన్నదేమో అనే సమాచారము కొరకు శిష్యుడైన గేహజీని పంపించెను. అంతట గేహజీ ఆమెకు కుమారుడు లేడు, మరియు ఆమె భర్త ముసలి వాడు అని అతనితో చెప్పెను. ప్రవక్త ఆమెతో మరుసటి యేట ఈ ఋతువున నీ కౌగిట కుమారుడు ఉండునని చెప్పెను. పిమ్మట ఆ స్త్రీ గర్భవతియై మరుసటి యేట ఎలీషా తనతో చెప్పిన కాలమున కుమారుని కనెను.

ఆమె దైవజనుడైన ఎలీషాలో ఉన్న మంచి లక్షణములను బట్టి బస విషయమై భర్తకు ఇచ్చిన సలహా, కుటుంబములో దేవుని సహాయమును పొందుకొనేటట్లుగా చేసింది, సంతోషము కలిగించింది. కుమారుడు అనుగ్రహించబడ్డాడు. అంతేకాక కుమారుడు చనిపోయినప్పుడు ప్రవక్త యొద్దకు వెళ్ళి దేవుని సహాయము ద్వారా కుమారుని బ్రతికించుకోగలిగింది.

**2.** అతని భార్యయైన జెరెషును, అతని స్నేహితులందరును ఏబది మూరల ఎత్తుగల యొక ఉరికొయ్య

చేయించుము. దాని మీద మొర్దెకై ఉరి తీయింపబడునట్లు రేపు నీవు రాజుతో మనవి చేయుము, తరువాత నీవు సంతోషముగా రాజుతో కూడ విందునకు పోదువు అని అతనితో చెప్పిరి. ఈ సంగతి హామానునకు యుక్తముగా కనబడినందున అతడు ఉరికొయ్య యొకటి  సిద్ధము చేయించెను. (ఎస్తేరు 5:14).

హామాను అహష్వరేషు రాజు యొక్క అధిపతులందరి కంటే పై అధికారములో ఉన్న వ్యక్తి. కాబట్టి రాజు గుమ్మము దగ్గర ఉన్న రాజసేవకులందరును మోకాళ్ళూని హామానుకు నమస్కరించిరి కానీ మొర్దెకై వంగకయు, నమస్కారము చేయకయు ఉండెను. హామాను మొర్దెకై మీద బహుగా కోపము పెంచుకొని, అతని ప్రాణము తీయుట స్వల్పకార్యముగా ఎంచుకొని, అతని జనులైన యూదులందరిని చంపవలెనని ఆలోచించి, శాసనమును ఒకటి రాజు ముద్రతో చేయించెను. హామాను భార్యయైన జెరెషు, అతని స్నేహితులు హామాను యొక్క ఆలోచనలను ఎరిగిన వారైననూ వాటిని ఖండించి, మంచి సలహాను ఇవ్వక ఉరికొయ్య చేయించి, మొర్దెకైను ఉరి తీయించమని చెప్పారు. ఇది భర్తయైన హామానుకు చాలా మంచిదిగా అనిపించి తన అధికారము ద్వారా ఉరికొయ్యను చేయించెను.

అంతలో రాణియైన ఎస్తేరు రాజైన అహష్వరేషుని, హామానుని విందుకి పిలిచి, తన జనులైన యూదుల నిమిత్తము చేయబడిన శాసనము గురించి రాజుని వేడుకొనెను. మా విరోధియగు ఆ పగవాడు దుష్టుడైన యీ హామానే అని అనెను. అంతట రాజు హామానుని ఉరి తీయించెను. కాగా హామాను మొర్దెకైకి  సిద్ధము చేసిన ఉరికొయ్య మీద వారు అతనినే ఉరి తీసిరి.

భార్య, స్నేహితుల యొక్క చెడ్డ సలహా విని ఎవరు తీసిన గోతిలో వారే పడతారు అన్నట్లుగా తాను సిద్ధము చేయించిన ఉరికొయ్య మీద అతనే ఉరితీయబడ్డాడు.





**3.** ఆది సంఘము పరిశుద్ధాత్మతో నింపబడినదై యుండెను. భూములైననూ, ఇండ్లయిననూ కలిగిన వారందరూ వాటిని అమ్మి, అమ్మినవాటి వెల తెచ్చి అపోస్తలుల పాదముల యొద్ద పెట్టుచు వచ్చిరి. కలిగిన దంతయు సమిష్టిగా ఉంచి, ప్రతి వానికి  వాని వాని అక్కర కొలది పంచిపెట్టిరి. కనుక ఎవ్వరు కొదువ లేకుండా జీవించుచుండిరి. ఈ విధముగా జరుగుచూ ఉండగా అననీయ, సప్పీరా

అను భార్యభర్తలిద్దరూ ఏకమై పొలము అమ్మెను. భార్యకు చెప్పి అననీయ దాని వెలలో కొంత దాచుకొని, కొంత తెచ్చి అపోస్తలుల పాదముల యొద్ద పెట్టెను. అప్పుడు పేతురు– అననీయా, నీ భూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను? నీవు మనుష్యులతో కాదు దేవునితోనే అబద్ధమాడితివని వానితో చెప్పెను. అననీయ ఈ మాటలు వినుచునే పడి ప్రాణము విడిచెను. అపో. కా. 5:3 సుమారు మూడు గంటల తరువాత అననీయ భార్య సప్పీరా జరిగినది ఎరుగక లోనికి వచ్చెను.



అప్పుడు పేతురు ఇంతకే భూమిని అమ్మితిరా అని ఆమెను అడిగెను. అందుకు ఆమె– అవును ఇంతకే అని చెప్పెను. అందుకు పేతురు ప్రభువు యొక్క ఆత్మను శోధించుటకు మీరెందుకు ఏకీభవించితిరి ? అని అడిగెను. (అపో.కా. 5:7–9) వెంటనే ఆమె అతని పాదముల యొద్ద పడి ప్రాణము విడిచెను.

అననీయ భార్యయైన సప్పీరా భర్తకు మంచి సలహా ఇవ్వక అతనితో ఏకీభవించింది. అందరూ దైవభక్తితో వెళ్ళుచున్నారు, మనము కూడా అమ్మిన వెల అంతా దేవునికే ఇద్దాము. అప్పుడు ఆయన మనకి ఏదీ తక్కువ చేయరు అనే ప్రోత్సాహకరమైన సలహా వారిని ప్రాణములతో ఉంచి దేవుని యొక్క ఉద్దేశములలో నిలిపేది. అయితే సప్పీరా తప్పుని ఖండించక మౌనముగా ఉండి, భర్తకు సహకరించింది. భర్త చెప్పిన అబద్ధముతో ఏకీభవించి, పరిశుద్ధాత్మ దేవునిని, సంఘమును మోసము చేసి ప్రాణములను పోగొట్టుకున్నారు.

భర్తలు తప్పు మార్గములలో ఉన్నప్పుడు వాక్యము ద్వారా వారిని హెచ్చరించి, ఓర్పుతోను, సహనముతోను వారిని మార్చుకునే స్త్రీలుగా ఉండాలి. స్త్రీలు భర్తకు లోబడి, సహనముతో జ్ఞానము కలిగి కుటుంబములను కట్టుకోవాలని లేఖనములు చెప్పుచున్నాయి కదా అని భర్త తప్పుమార్గంలో వెళ్తుంటే ఏకీభవించకూడదు. లోబడే విషయములో దైవజ్ఞానమును కలిగి ఏది యుక్తమో, న్యాయమో జ్ఞానయుక్తముగా ఆలోచించాలి. భర్త యొక్క పొరపాట్లను, తప్పుల్ని ఖండించగలిగిన భార్యగా ఉండాలి.

ప్రియ సహోదరీ! మనము సలహాలు ఇచ్చుటలోనూ, ఏకీభవించుటలోనూ, ఖండించుట లోనూ ఎటువంటి వారిగా ఉంటున్నాము? ఒక తల్లి బాధ్యత వలన మాత్రమే కుటుంబము దేవునిలో మార్పు చెంది, బిడ్డలు విశ్వాసములో పెంచబడతారు. అబద్ధములు చెప్పుటలోను, ఇతరులకు కీడు చేయుటలోను ఏకీభవించే వారిగా కాక, మేలు చేయుట యందు ఆసక్తి కలిగి సలహాలు ఒకరి నుండి ఒకరము పొందుకుంటూ, ఇచ్చుకుంటూ ప్రోత్సాహపరుచుకుంటూ, నటన వేషధారణ లేని వారిగా కుటుంబములలోనూ దేవుని ఎదుట జీవిస్తూ, జ్ఞానము గల స్త్రీల వలె నిలిచి ఉందాము. అట్టి కృప దేవుడు మనకు దయచేయును గాక !

# కిటికీ (Window)



ఒక కాలనీలో రెండు కుటుంబములు ఉండేవి. వారు నివసించే ఇళ్ళు ఒక దానికి ఒకటి ఎదురుగా ఉండేవి. ఒక ఇంటి కిటికీలో నుండి చూచినపుడు ఎదురింటి బాల్కానీలోని వాష్‌బేసిన్ కనబడుతూ ఉండేది. ఆ ఇంటావిడ ప్రతి రోజూ ఎదురింటి వాష్‌బేసిన్‌ను తన భర్తకు చూపిస్తూ ఆవిడకి అస్సలు శుభ్రం లేనట్లుంది,వాష్‌బేసిన్ ఎంత మురికిగా ఉందో చూడండి అని చెబుతూ ఉండేది. ఈ విధముగా ప్రతిరోజూ ఉదయమునే బాల్కానీ వైపు చూస్తూ తన భర్తకు ఎదురింటావిడ అశుభ్రం గురించి పదే పదే చెప్పడం అలవాటుగా మారింది. ఆమె భర్త ఏమీ మాట్లాడేవాడు కాదు. నెలరోజులు గడిచిన తరువాత ఓ రోజు నిద్ర లేచి అలవాటుగానే ఎదురింటి బాల్కానీ వైపు చూచి, ఆమె ఆశ్చర్యపోయింది. తన భర్తను పిలిచి రోజూ నేను ఎదురింటావిడ గురించి అంటున్న మాటలు ఆవిడతో ఎవరైనా చెప్పారేమో, ఆ వాష్‌బేసిన్‌ని చాలా శుభ్రం చేసింది అని అంది. అప్పుడు భర్త నెమ్మదిగా ఎదురింటావిడ వాష్‌బేసిన్‌ను శుభ్రం చెయ్యలేదు కానీ నేనే ఉదయము మన కిటికీ అద్దాలను శుభ్రపరిచాను అని చెప్పేసరికి ఆమెకు కనువిప్పు కలిగింది.

ప్రియమైన వారలారా ! ఇది అర్థం అయ్యిందనుకుంటాను. ఆమె తన ఇంటి కిటికీ అద్దాల సంగతి, అనగా వాటికి ఉన్న మురికి గురించి పట్టించుకోకుండా, వాటిలో నుండి ఎదురింటి వాష్‌బేసిన్‌ను చూచినప్పుడు అది మురికిగా కనిపించేది. మన హృదయం యొక్క పరిస్థితి కూడా ఇంతే. మాలిన్యమును, మురికిని, అపరిశుద్ధతని హృదయములో దాచుకొని, ఆ హృదయముతోనే ఎదుటి వారిని చూచి, అన్నిటినీ అనుమానిస్తూ, మనల్ని మనం పరిశీలించుకొనకుండా జీవిస్తూ ఉంటాము. ఎప్పుడైతే వాక్యపు వెలుగులో మన హృదయమును పరిశీలించుకొని, అపరిశుద్ధత, అశుభ్రతను తొలగించుకుంటామో, తేట కలిగిన హృదయముతో ఎదుటి వారి క్రియలను పరిశీలించి మనిషిలోని పాపమును ద్వేషించి, మనిషిని ప్రేమించగలిగే వారిగా ఉంటాము. ఎప్పుడూ మన తప్పు మనలోనే దాచుకొని ఎదుటి వారిని తప్పు పట్టడానికి ప్రయత్నించకూడదు. మన హృదయములోని ఆలోచనలను బట్టి ఎదుటి వారు కూడా ఇంతే అని తీర్పు తీర్చే స్థితిలోకి వెళ్ళక మన హృదయములో విశాల భావం కలిగి ఎదుటి వారిని ప్రేమిద్దాం.



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 5వ భాగము**

దేవుడు మానవులకు ప్రత్యక్షము అయ్యే విధము ఒక్కొక్కరికి ఒక్కొక్క విధముగా ఉంటుంది. మానవులందరి స్వభావము, ఉద్ధేశ్యములు ఒకే రకముగా ఉండవు కాబట్టి అగమ్యగోచరమైన మానవ ఉద్ధేశ్యములకు అనుగుణంగా దేవుడు తనను తాను ప్రత్యక్షపరచుకుంటారు. అయినప్పటికిని అనేక మందికి దేవుడు ప్రత్యక్షమైన పద్ధతులలో పోలికలు కూడా లేక పోలేదు. దేవుడు సుందర్‌కి ప్రత్యక్షమైన తీరును గమనిస్తే, 1800 సం॥ల క్రితము దమస్కు మార్గములో తార్సువాడైన సౌలుకు సంభవించిన సంఘటనను జ్ఞాపకం తెచ్చేదిగా ఉన్నది. సుందర్ కూడా సౌలు వలెనే క్రైస్తవులను ఎంతో ద్వేషించాడు. మహిమాస్వరూపియైన క్రీస్తు తానే స్వయముగా ప్రత్యక్షము కావడంతో సౌలు వలెనే సుందర్ కూడా దైవికంగా ఆపబడినాడు. సౌలు వలెనే నన్నెందుకు హింసించుచున్నావనే ప్రశ్ననే సుందర్ కూడా ఎదుర్కొన్నాడు. క్రీస్తు ప్రభువు వారితో మాట్లాడిన మొట్టమొదటి మాటలు ప్రశ్నారూపంగానే వారు విన్నారు. క్రీస్తు ప్రత్యక్షత దొరికిన ఆ కొద్ది క్షణాలు సౌలు జీవిత విధానమును మార్చిన రీతిగానే సుందర్ జీవిత విధానమును కూడా మార్చివేసాయి.

తెల్లవారుఝాము నాలుగున్నర గంటల వరకు ప్రార్థించుచూ కృష్ణుడు గానో, బుద్ధుడుగానో లేదంటే అవతార పురుషులలో ఎవరో ఒకరు గాని ప్రత్యక్షమవుతారని ఎదురుచూస్తూ ఉండినాను. కానీ వారు నాకు ప్రత్యక్షం కాలేదు, అయితే నా గదిలో వెలుగు ప్రకాశిస్తూ ఉంది. ఈ వెలుతురు ఎక్కడి నుండి వస్తుందా అని తలుపు తెరిచి బయటకు చూస్తే, బయట అంతా చీకటిగానే ఉంది. వెనుతిరిగి చూచినంతలో ఆ వెలుగు అంతకంతకు ప్రకాశమానమైనదై ఒక గోళాకార రూపమును సంతరించుకొని భూమి మీదికు దిగింది. ఆ వెలుగులో నేను ఊహించిన వారెవ్వరూ గాక చనిపోయాడని నేను తలంచిన యేసుక్రీస్తు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు ఆయన పలికిన ఆ కొద్ది మాటలను గానీ మహిమతోనూ, ప్రకాశముతోనూ నింపబడిన ఆయన ముఖమును గానీ ఆ నిత్యరాజ్యములో కూడా మర్చిపోలేను. నీ కొరకు, సర్వలోకము కొరకు నేను చనిపోయాను, నన్నెందుకు హిసించుచున్నావు అని ఆయన నన్నడిగారు. ఈ మాటలు నా హృదయంలోనికి మెరుపు వలె దూసుకు పోయాయి, నేను ఆయన ఎదుట సాగిలపడ్డాను. చెప్పనశక్యమైన సంతోషసమాధానములతో నా హృదయము నిండిపోయింది. నా జీవితం మారిపోయింది అని తరువాత సంవత్సరములలో సుందర్ తన అనుభవమును ఆయన మాటలతో వివరించారు.

పెద్ద శబ్దముతో లూధియానా ఎక్స్‌ప్రెస్ వచ్చి చాలా దూరము వెళ్ళిపోయిననూ, దాని శబ్దము కూడా సుందర్‌కి వినిపించలేదు. తన గదిలో అలా సాష్టాంగపడి ఉండగానే ఎంతో ఉపశమనంతోను, చెప్పనశక్యమైన క్షేమముతోను నిండిపోయాడు సుందర్. గత కొద్ది నెలలుగా తనలో ఎక్కువైపోవుచున్న దిగ్భ్రాంతి, కోపము, విసుగుదల, నిరాశ, నిస్పృహలన్నీ ఒక్కక్షణంలో మటుమాయమై పోయాయి.

అనుకోకుండా కలిగిన ఆ ప్రత్యక్షత యొక్క దేదీప్యమానమైన వెలుగులో వాటన్నిటిని మర్చిపోయాడు. ఎంతో ప్రేమతోను, ఒప్పించేరీతిగాను తనంతట తానుగా తనకు ప్రత్యక్షమైన ఆ సిలువ మూర్తి యొక్క ఆరాధనలో సుందర్ యొక్క హృదయము పూర్తిగా లీనమైపోయింది. పూర్వాపరములను గురించి ఆలోచించలేదు, భవిష్యత్తు గురించి కూడా తలంచియుండక పోవచ్చు.

సుందర్ ఇంకా నూనుగుమీసాల యౌవనుడే. యౌవనకాలంలో ఉండే ఆసక్తి, ఉత్సాహాలతో నిండి ఉన్నాడు. తనకు కలిగిన ఈ ఆశ్చర్యకరమైన అనుభవమును, క్రీస్తుతో తనకు ఏర్పడిన నూతన సంబంధమును నలుగురికి తెలియజేయాలనే ఆసక్తితో ఉన్నాడు. ఇంకా తెల్లవారలేదు, లోగిలిలో ఎవ్వరూ తిరుగుచున్నట్లుగా లేదు. తండ్రి గదిలోనికి వెళ్ళి ఆయనను తట్టి లేపి, నేను యేసుక్రీస్తును చూచాను, నా గదిలో ఇప్పుడే ఆయన ప్రత్యక్షమయ్యాడు, నేను క్రైస్తవుడనయ్యానని చెప్పాడు సుందర్. సుందర్ తండ్రి అయిష్టమైన మనసుతోనే " బుద్ధిహీనుడా ! ఏం మాట్లాడుచున్నావు ? 3 రోజుల క్రితమే గదా క్రైస్తవుల గ్రంధాన్ని కాల్చివేసావు, ఇప్పుడేమో నేను క్రైస్తవుడనయ్యానంటున్నావు, నేనింకా నిద్ర పోవాలి, నీవూ వెళ్ళి పండుకో " అని ప్రక్కకు తిరిగి కండ్లు మూసికున్నాడు. దీని సంగతి ఇంతటితో అయిపోయినట్లే అని అనుకున్న సుందర్ తండ్రికి తాను పొరబడ్డానని తెలుసుకోవడానికి ఎన్నో రోజులు పట్టలేదు. తాను చూచిన దర్శనమును గురించి ఇంట్లోనే మిగిలిన వారితో కూడా చెప్పనారంభించాడు. తండ్రి వలెనే వారు కూడా " నీవేదో ఊహించుకొని ఉంటావు. లేదంటే ఏదో చెడ్డకల వచ్చి ఉంటుంది, లేదంటే నీకు పిచ్చి పడుతున్నదేమో ! " అని చెప్పినప్పటికిని తాను కన్నదాని విషయములోను, విన్నదాని విషయములోను కొంచెము కూడా సందేహము లేదు సుందర్‌కి.

స్కూల్‌లో తన స్నేహితుడైన హెడ్మాష్టరు గారి కుమారునితో క్రైస్తవుడవటమెలా? అని తన ఆశను వెల్లడించాడు సుందర్. అతడు ప్రధానోపాధ్యాయుడైన తన తండ్రికి ఆ విషయము చెప్పినపుడు ఆయనకు ఏమి చేయాలో పాలుపోలేదు. ఇతర మతాలకు చెందిన విద్యార్థులెవరైనా క్రైస్తవ మతము స్వీకరించడానికి అణువంత ఆశ కనుపరిచినా, తన మీదే కాక, పాఠశాల యాజమాన్యం మీద కూడా తల్లిదండ్రులు కోపం చూపుతారని, ఇలాంటి వాటి పర్యవసానమెలా ఉంటుందో చెప్పలేమను సంగతి ఆ ప్రధానోపాధ్యాయునికి తెలుసు. అయితే ఇలాంటి తీవ్రమైన ఆశలు గల కుర్రవానిని పట్టించుకోకుండా ఎలా వదిలివేయగలడు. ఆ పరిస్థితులలో తానుచేయగలిగినదంతా చేసాడు. సుందర్‌కు రహస్యముగా బైబిలు నేర్పించడానికి అంగీకరించి, స్కూలు ముగిసిన తరువాత సాయంకాలములలో నేర్పించాడు. ఇలా కొద్ది నెలలు గడిచింది. బైబిలు చదువుచున్నప్పుడు, డిశంబరు నెలలో ఓ తెల్లవారుఝామున చీకటిలో అద్భుతముగా ప్రత్యక్షమైన యేసుప్రభువు వైపు సుందర్ హృదయము ఎంతో ఆకర్షించబడింది. కల్వరికి దారి తీసిన శ్రమల మార్గములో నడిచిన యేసుప్రభువు మహిమను ధ్యానించుచుండిన ప్రతిసారి సుందర్ కన్నీరు కార్చేవాడు. పాఠశాల విద్యార్థిగా ఉన్న సుందర్ హృదయములో శిష్యత్వమునకు ఉన్న షరతులు లోతుగా నాటుకు పోయాయి.

మార్కు8-34,35 లో చెప్పబడినట్లుగా నన్ను వెంబడింపగోరువాడు తన్ను తాను ఉపేక్షించుకొని తన సిలువనెత్తుకొని నన్ను వెంబడింపవలెను. తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దాని పోగొట్టుకొనును. నా నిమిత్తము, సువార్త నిమిత్తమును తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని రక్షించుకొనును, శిష్యత్వమునకు ఎంత వెల చెల్లించాలనే సత్యమును తన క్రైస్తవ జీవిత ఆరంభములోనే నేర్చుకొన ప్రారంభించాడు సుందర్.

- సేకరించబడింది (ఇంకావుంది).

# ఓటమి - గెలుపు



Hai Children! ఎలా ఉన్నారు? ఏంటి మీలో కొంతమంది dull గా కన్పిస్తున్నారు? కొందరేమో చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఆ... నాకర్థమయ్యింది. Schools open చేసారనేగా? ప్చ్... అప్పుడే సెలవులు అయిపోయాయి కదా ! పిల్లలూ ! Holidays లో ఏమేమి చేసారో ఎక్కడికి వెళ్ళారో ఆ వింతలూ, విశేషాలు, కబుర్లు అన్నీ మీ Friends కి చెప్పారా ? మీరు సాధించిన విజయాలు ఒకరితో ఒకరు Share చేసుకున్నారా ? పిల్లలూ మీలో ఎవరైనా Fail అయివుంటే బాధపడండి కానీ నిరుత్సాహపడవద్దు. మీలానే Fail అయిన ఒక కుర్రాడు ఎలా విజయాలు సాధించి అందరి మెప్పు పొందుకున్నాడో వినండి.

పదవ తరగతి పరీక్షలు రాసి... వేసవిలో బంధువుల ఇంటికి వెళ్ళాడు వేణు. Results వచ్చాయి. పరీక్షలో పాస్ అవుతానన్న నమ్మకం లేదు. అంతలో ఒకరు Results పేపర్ని పట్టుకొని వచ్చారు. ఇంట్లో ఉన్న పిల్లలు రిజల్ట్ కోసం ఆసక్తిగా చూస్తున్నారు. మిగతా వారి నెంబర్లు కనిపించినా.... వేణు నెంబరు కనిపించలేదు. వీడా పాస్ అయ్యేది? అని అందరూ అంటున్న మాటలతో దిమ్మ తిరిగినంత పనైంది, ఉబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ... అపజయం ఇంత భయంకరమా? అనుకున్నాడు. బేలగా.... మౌనంగా ఉండిపోయాడు. అందరూ హేళనగా చూస్తున్నారు. ఒక్కరు కూడా ధైర్యం చెప్పేవాళ్ళులేరు. వేణుకి అతని మీద అతనికే కోపం వచ్చింది. నన్ను నేనే ఇష్టపడట్లేదు. ఇంక వీరందరూ ఎందుకు ఇష్టపడతారు అనుకొని మరి ఎక్కువగా బాధపడ్డాడు.

ఆ సమయములో వేణుకు తన friend ఎప్పుడో చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. “యేసుక్రీస్తు నిన్ను ప్రేమిస్తున్నాడు” అని చెప్పి నీవు కూడా ప్రార్థన చేసుకో ఆయన నీకు సహాయం చేస్తాడు అని చెప్పేవాడు. అప్పుడు అతని మాటలు ఎగతాళి చేసాడు, కానీ ఇప్పుడున్న పరిస్థితులను బట్టి యేసయ్యే ఆధారమనుకున్నాడు. వెంటనే మోకాళ్ళూని ప్రభువా నన్ను నిజంగా నీవు ప్రేమిస్తున్నట్లయితే ఈ సమయములో నీ సహాయం నాకు కావాలి, నాకు ఓదార్పునివ్వు, ధైర్యం ఇవ్వు అని ప్రార్థించాడు. వెంటనే తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళి క్షమాపణ అడిగి, ఈ ఒక్కసారి అవకాశం ఇవ్వండి, బాగా చదివి పాస్ అవుతానని చెప్పి బాగా చదువుకోసాగాడు. చాలా పట్టుదలతో చదువుతూ, ప్రార్థన కూడా చేసుకునేవాడు. అన్నీ జ్ఞాపకం ఉండేలా సహాయం చేయమని యేసయ్యను అడిగేవాడు. యేసయ్య ఇచ్చిన ధైర్యం కొండంత బలాన్ని ఇచ్చింది. Exams బాగా వ్రాసాడు.

ఫలితాల పేపర్ చూసి “వీడు జీవితంలో పైకి వస్తాడు...” అంటూ అంతకు ముందు ఎగతాళి చేసిన బంధువులే ఇప్పుడు మెచ్చుకుంటున్నారు. విజయం సాధిస్తేనే విలువ ఉంటుందన్న విషయం వేణుకి ఈ సంఘటనతో మనసులో బలంగా నాటుకుపోయింది. ఆ పై చదువులలో కూడా ఈ సంఘటన ఒక స్ఫూర్తిగా నిలిచిపోయింది. ఇంక ఎన్నడూ ఓటమి చూడలేదు, విజయాలు సాధిస్తూ జీవితములో స్థిరపడ్డాడు. అనేకులకు ధైర్యం చెప్పేవాడిగా ఉన్నాడు. యేసయ్య గురించి మరి ఎక్కువ చెప్పేవాడు. ఆ సమయములో పొందిన యేసయ్య ప్రేమ, ఓదార్పు, ధైర్యం అతని జీవితములో ఎన్నడూ మర్చిపోలేదు, ఎవరు బాధలో కనబడినా, అపజయం పొందినా తన అనుభవాన్ని చెప్పి ధైర్యం చెప్పేవాడు.

పిల్లలూ! మీరు కూడా కుమిలిపోకుండా దేవునిపై ఆధారపడే ప్రయత్నం చేయండి. తప్పకుండా విజయం సాధించి అందరి మెప్పు పొందుకుంటారు. ఈ New Academic year లో బాగా చదువుకొని మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తారని ఆశిస్తూ......

– ప్రేమతో మీ అక్కయ్య

# “నా జీవితములో దేవుని మేలులు”

ఎస్.రాజబాబు, కృష్ణా జిల్లా

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ అందరికి నా హృదయపూర్వక వందనములు. నా పేరు బాబురావు, మాది కృష్ణాజిల్లాలో ఒక మారుమూల గ్రామము. విగ్రహారాధన కుటుంబములో పుట్టిన నేను చిన్ననాటి నుండి పూజలు, పండగలు, ఆచరించడములో చాలా ఆసక్తిని కనపరిచేవాడిని. నేను ఐ.టి.ఐ(మెకానికల్) ని పూర్తి చేసుకొని, 1989 లో ఉద్యోగ నిమిత్తము హైదరాబాద్‌కు వచ్చి, బాలానగర్‌లో ఉండేవాడిని.

1994 లో నాకు వివాహము జరిగింది. అయితే చిన్న తనములోనే “యేసుప్రభువు” మాత్రమే దేవుడు అని తెలుసుకున్న నా భార్య, నేను ఏమైనా అంటానేమోనని మాత్రమే విగ్రహారాధనలో నాతో ఏకీభవిస్తూ ఉండేది.మాకు ఒక పాప, బాబు, 1998లో మేము చింతల్‌కు వచ్చాము. అప్పుడు మా ఇంటి ప్రక్కన ఉన్న ఇంటిలో బ్రదర్. ఎపఫ్రా గారు వచ్చి వాక్యము బోధిస్తూ ఉండేవారు. అది తెలిసికొనిన నా భార్య నేను కూడా ప్రార్థనకు వెళ్తాను అని అడిగి, అప్పుడప్పుడు అక్కడకు వెళ్తూ ఉండేది. ఒకరోజు నా భార్యతో నువ్వు యేసుప్రభువే గొప్పవాడు అంటావు కదా! ఈ హైదరాబాద్‌లో మనము ఒక ఇల్లు కట్టుకొనడానికి సహాయము చెయ్యమను, అప్పుడు నేను ఆయనను నమ్ముకుంటాను అని అన్నాను. అయితే చిన్న ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగము చేయుచున్న నేను దేవుని యొక్క సహాయముతో ఒక ఇల్లు కట్టుకోగలిగాను. అప్పటి నుండి నా భార్య ప్రతివారము ప్రార్థనకు వెళ్తూ ఉండేది. నాకు ఇష్టములేనప్పటికి, ప్రార్థనకు వెళ్ళవద్దని చెప్పేవాడిని కాదు కానీ, వచ్చిన తరువాత సణుగుకుంటూ, కోపముతో భోజనము కూడా చేసేవాడిని కాను.

ఒకసారి అక్కడ ప్రత్యేకమైన ప్రార్థన జరుగుచున్నప్పుడు వాళ్ళు నన్ను కూడా పిలిస్తే, ఆ ప్రార్థనకు వెళ్ళాను.మొదటిసారి వెళ్ళిన నాకు అక్కడ ఏదో తెలియని సమాధానం, ప్రశాంతత నన్ను ఆవరించినట్లుగా అనిపించింది. ఆ తరువాత నా భార్య ప్రార్థనకు వెళ్ళివచ్చినప్పుడెల్లా అక్కడ విన్న వాక్యము, సాక్ష్యములు నాకు చెబుతూ ఉండేది. అప్పటి నుండి నాకు కూడా దేవుని మీద విశ్వాసం పెరిగింది. ఆయన నా కొరకు తన ప్రాణం పెట్టారని, నా పాపములు ఆయన ద్వారా క్షమించబడతాయని తెలుసుకొని నేను కూడా ప్రతి వారము ప్రార్థనకు వెళ్ళడం మొదలుపెట్టాను. అక్కడ సేవకులు చెప్పే వాక్యము, ఆయన ప్రవర్తన, చూపించే ప్రేమవలన దేవుని వైపు ఇంకా ఆకర్షించబడ్డాను. పాపక్షమాపణ నిమిత్తము బాప్తీస్మము పొంది దేవుని నీతిని నెరవేర్చాలనే ఆశతో నేనూ, నా భార్య బాప్తీస్మము పొందడం జరిగింది. అప్పుడు నాపేరు రాజబాబుగా మార్చబడినది. పరలోక రాజ్యములో స్థానమును సంపాదించుకొన్నాననే నిశ్చయత నాకు కలిగినది.

మా బంధువులలో యేసుప్రభువుని ఎరిగిన వారు ఎవరూ లేరు, దేవుని యొక్క మహా కృప చొప్పున మమ్మల్ని రక్షించి, ప్రేమగల పరిచర్యలో నిలిపి ఉంచారు. అందును బట్టి మేము దేవునికి ఎంతో ఋణస్థులమై ఉన్నాము. పరిచర్యను నడిపించే సేవకులు, బోధించుచున్న వాక్యములు, సహోదర, సహోదరీలు చూపించుచున్న ప్రేమ, ఇంకా దేవునిలో జీవించాలనే ఆశను, కలిగించి, పరిచర్యను చూచినప్పుడెల్లా ఆనందమును కలుగజేయుచున్నవి. అంతే కాక, దేవుడు నా కుటుంబములో ఆత్మీయ, ఆర్థిక, ఆరోగ్య విషయములలో తోడుగా ఉండి నడిపిస్తున్నారు. మరియు నా పిల్లల చదువులలో తగిన జ్ఞానముతో నింపి, చిన్నప్పటి నుండి ఆయనలోనే పెంచుతూ, ఆసక్తితో ముందుకి నడిపిస్తున్నారు. మా కుటుంబం అంతా చివరి శ్వాస వరకు ఆయనలో నమ్మకముగా జీవించాలని ప్రార్థించండి.

**సవరణ :** గడచిన పత్రికలో జోనాతాన్ గోఫోర్త్ జన్మించిన సం॥ 1859కి బదులు 1959 గా అచ్చుతప్పు పడింది. దీనిని గమనించగలరు


చందా వివరములు

**సంవత్సర చందా : రూ. 50/-లు.**

**జీవితకాల చందా : రూ. 1000/-లు.**

**విదేశములకు : సంవత్సరమునకు US $20**

పంపవలసిన మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070





# ఇది తెలుసా?

## సోమాలియా

సోమాలియా అను దేశము ఆఫ్రికా ఖండములో ఉంది. జూన్ 26, జూలై 1, 1960 వ సం॥లో బ్రిటన్, ఇటలీల నుండి స్వాతంత్ర్యము వచ్చింది. దీనిని రిపబ్లిక్ సోమాలియా అని పిలిచేవారు.

| | | | |
|---|---|---|---|
| ప్రధాని | : షరీఫ్ షేక్ అహమ్మద్ | రాజధాని | : మొఘదీషు |
| దేశ జనాభా | : 95,58,666 | అధికార భాష | : సోమాలి, అరబిక్ |

కరెన్సీ : సోమాలి షిల్లింగ్

(మన దేశములో 100 రూపాయిలు 3000 షిల్లింగ్స్‌తో సమానము).

1. అంతర్జాతీయ సర్వేలలో ఇది పేద దేశముగా గుర్తించబడింది.
2. ప్రపంచములోనే చట్టములు సరిగా అమలు కాని దేశము.
3. సరియైన పరిపాలన లేక అంతర్యుద్ధములలో అనేకులు చనిపోవడం జరుగుతుంది.
4. దేశ జనాభాలో ఎక్కువ శాతం ప్రజలు సంచార జాతులుగా ఉండడం జరుగుతుంది. ఎక్కువగా గల్ఫ్ దేశములకు కూలీలుగా వెళ్తూ ఉంటారు, కారణం పంటలు సరిగా పండకపోవటమే.
5. సువార్తకు ద్వారములు మూయబడిన దేశములలో సోమాలియా ఒకటి.
6. 95 లక్షల మంది జనాభాలో క్రైస్తవులు సుమారుగా 5,000 కంటే తక్కువగానే ఉన్నారు.
7. ఇక్కడి ప్రజలు క్రైస్తవులు చేసే సహాయములను కూడా వ్యతిరేకించి, వారిని హీనముగా చూస్తూ ఉంటారు.
8. ఆఫ్రికా ఖండములో హెచ్.ఐ.వి ఇన్‌ఫెక్షన్ తక్కువగా ఉన్న దేశముగా గుర్తించవచ్చు.

ఆఫ్రికా ఖండములో పేద దేశముగా చెప్పబడుచున్న సోమాలియా దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితుల కొరకు, సువార్తకు ద్వారములు తెరువబడునట్లు, అంతర్యుద్ధములు తొలగిపోవాలని, ప్రజలు దాహం కూడా సరిగా తీర్చుకోలేని ప్రాంతములు ఉన్న ఈ దేశము కొరకు భారంతో ప్రార్థన చేద్దామా !



# ఆతిథ్యము

సాధారణముగా మన ఆచార అలవాట్లలో ఆతిథ్యమివ్వడం ఎంతో ప్రాముఖ్యమైనది. ఆతిథ్యము అనగా అతిథిని గౌరవించుట, సత్కరించుట. అతిథిని గౌరవించి వారికి కావలసిన వాటిని గుర్తించి పరిచర్య చేయుట.

**ఆతిథ్యపు ఏర్పాట్లు ఏవనగా :-**

మొదట అతిథిని గౌరవంగా ఆహ్వానించి, ప్రేమతో పలకరించి, కాళ్ళకు నీళ్ళు ఇవ్వడం తరువాత దాహము తీర్చుటకు మంచినీళ్ళు ఇవ్వడం అన్నవి ఎంతో ముఖ్యమైనవి. అంతే కాక అలసట తీర్చుకొనుటకు కావలసిన ఏర్పాట్లు చేయడం, ప్రాణము బలపరచుకొనుటకు ఆహారమును సిద్ధపరచడం. సిద్ధపరచడం మాత్రమే కాక వడ్డించే విషయములో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వారు ఆహారము తీసుకుంటున్నప్పుడు మనము మాట్లాడుకుంటూ ప్లేట్‌లో ఆహారము అయిపోయిననూ, పట్టించుకోని వారముగా కాక, అయిపోయిన వెంటనే వడ్డించే వారముగా ఉండాలి. మనము ఇచ్చే ఆతిథ్యము అతిథుల్ని సంతృప్తి పరిచి, సంతోషముతో నింపి, ఇలాంటి ఆతిథ్యము మరల ఎప్పుడు పొందుకుంటామో అనే ఆసక్తిని చూపే విధముగా ఉండాలి.

కానీ ఈ దినములలో ఆతిథ్యము ఇచ్చే విషయములో ఎంతో నిరాశను కలిగించే పరిస్థితులు కనబడుచున్నాయి. క్రమేణా కాళ్ళు కడుగుకొనుట అనేది కనుమరుగై పోతూ ఉండగా మంచినీళ్ళు ఇవ్వడం కూడా గగనమై పోతుంది. కాలానుగుణంగా మనుష్యులలో వస్తున్న మార్పు కారణంగా ఆతిథ్యం ఇవ్వడం అనేది గతంలోని అనుభవములుగానే ఉండిపోతున్నాయి. ఈ పరిణామములు మనుష్యులకు ఒకరి మీద ఒకరికి ప్రేమ, ఆప్యాయత, బాధ్యతలను మరిచిపోయేటట్లు చేస్తున్నాయి.



బైబిలు గ్రంథములో అబ్రాహాము అనే వ్యక్తి ఇంటికి అతిథులు వచ్చినప్పుడు వాకిట దగ్గర నుండి పరిగెత్తుకొని వెళ్ళి వారిని తోడుకొని వచ్చి, కొంచెము నీళ్ళు తెప్పించెదను, కాళ్ళు కడుగుకొని అలసట తీర్చుకొనమని, ఆహారము తెచ్చెదను, ప్రాణమును బలపరచుకొనమని బ్రతిమాలు

కొనెను. (ఆది 18:4,5) ఆహా ! ఎంత చక్కటి ఆతిథ్యమును అబ్రాహాము పెద్దవయసులో ఉండి కూడా వచ్చిన అతిథులకు ఇచ్చాడు. మన ప్రేమను వెల్లడి చేసే మార్గములలో ఆతిథ్యము ఇచ్చుట ఒకటి. "ఏమీ సణుగుకొనకుండా ఒకరికి ఒకరు ఆతిథ్యము చేయుడి (1 పేతురు 4:9) "పరిశుద్ధుల అవసరములలో పాలుపొందుచూ శ్రద్ధగా ఆతిథ్యమును ఇచ్చుచూ ఉండుడి." (రోమా 12:13)

అతిథులకు అతిథి మర్యాదలు చేయుట ద్వారా కొందరు తెలియకుండానే దేవదూతలకు ఆతిథ్యమిచ్చినట్లుగా బైబిలు గ్రంథము చెపుతుంది. అధ్యక్షులుగా ఉండదగిన వారు అతిథి ప్రియులుగా ఉండాలి అనేది ప్రాముఖ్యమైన లక్షణంగా చెప్పబడుచున్నది.

ప్రియ చదువరీ ! సహజముగా విమానములో, హోటల్స్‌లో, రెస్టారెంట్లలో వచ్చిన అతిథులకు ఆతిథ్యమిచ్చుటకు పోటీపడటం గమనిస్తాము. వారు వ్యాపారములు బాగుగా జరుగుటకు ప్రయత్నిస్తూ ఉంటే, మనము మనుష్యులుగా మానవ సంబంధములలో ప్రేమ, ఆప్యాయతలను పెంపొందించ ప్రయత్నిద్దాము.

కాబట్టి నీ జీవితములో ఆతిథ్యము పొందడానికి చూపించే ఆసక్తిని ఇవ్వటానికి కూడా కలిగి ఉండాలి. అంతమాత్రమే కాక మీ కుటుంబములో ఉన్న పిల్లలను చిన్నవయసు నుండే ప్రేమ, ఆప్యాయతలతో ఆతిథ్యమిచ్చే వారిగా పెంచడం ఎంతో ముఖ్యము. అప్పుడు ఆ కుటుంబము దేవునికి మహిమ తెచ్చే కుటుంబముగా, మమతానురాగములకు నిలయముగా మార్చబడుతుంది.

**- ఎడిటర్**


రండి! పాల్గొనండి!! ఆశీర్వాదం పొందండి !!!

**ఆగష్టు 15వ తేది ప్రత్యేక ఉపవాస ప్రార్థన**

దేశ క్షేమం, క్రైస్తవ సంఘాల ఉజ్జీవం,
కుటుంబముల ఆశీర్వారము కొరకు దేవునిని వేడుకుందాం.

**సమయం:** ఉదయం గం. 9.00 లకు

**స్థలము:** బాలాజీ ఫంక్షన్ హాల్, N.H. 9, హయత్‌నగర్,హైదరాబాద్.

వివరములకు: బ్రదర్. రవీందర్, సెల్: 99631 17628

# ఆత్మఫలము - 3వ భాగము

- ఎడిటర్




**ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, విశ్వాసము, మంచితనము, సాత్వికము, ఆశానిగ్రహము.**

ఆత్మఫలములో మొట్టమొదటిది ప్రేమ. ప్రేమ మూడు విధములుగా చెప్పవచ్చును.

1. దేవుని మీద ప్రేమ
2. పొరుగు వారి మీద ప్రేమ
3. శత్రువు మీద ప్రేమ.

దేవుని మీద ప్రేమను గురించి తెలుసుకున్నాము.

**2. పొరుగు వారి మీద ప్రేమ:–** మన జీవితములో ప్రేమలో భాగముగా మొదట దేవుని మీద, రెండవదిగా పొరుగు వారి మీద ప్రేమను కలిగి ఉండాలి. యేసుప్రభువు శరీరధారిగా ఈ లోకములో జీవించిన కాలములో నిత్యజీవమును పొందవలెనంటే మనము గైకొనవలసిన ఆజ్ఞలు రెండుగా వివరించారు. మొదటిది దేవుడైన యెహోవాను పూర్ణహృదయముతో, పూర్ణాత్మతో, పూర్ణమనస్సుతో ప్రేమించవలెను. రెండవదిగా నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించవలెను. మనకు హాని చేసుకోవాలని, మనల్ని మనము నాశనము చేసుకోవాలని ఆలోచించక, మనల్ని మనము ఏ విధముగా ప్రేమించుకుంటామో మన పొరుగువారిని అదే విధముగా ప్రేమించవలెను. నేను వారికి మేలు చేయుట వలన నాకు ప్రయోజనము, ఉపయోగము ఏమిటి? వారు నాకు ఏ విధముగా ఇప్పుడూ, భవిష్యత్తులోనూ ఉపయోగపడగలరు? అనే స్వార్థపూరితమైన ఆలోచనలతోనూ, ఎల్లప్పుడూ అన్యాయముగా, దుర్బుద్ధితో ఎదుటి వారిది ఆశించే మనసుతోనూ జీవించక, నేను వీరికి ఏ విధముగా మేలు చేయగలను, ఉపయోగపడగలను అనే మనసుతో జీవించాలి. ఇట్టి వారిని దేవుడు కోరుకుంటున్నారు. ఎవడైనను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, సహోదరుని ద్వేషించినపుడు అతడు అబద్ధికుడగును. చూచిన సహోదరుని ప్రేమించని వాడు తాను చూడని దేవుని ప్రేమించలేడు. దేవుని ప్రేమించువాడు సహోదరుని కూడా ప్రేమించవలెను అని బైబిల్ గ్రంధములో చెప్పబడింది.

యేసుక్రీస్తు ఉపమానరీతిగా పొరుగువాని గురించి చెప్పుచూ ఒక వ్యక్తి యెరూషలేము నుండి ఎరికోకు వెళ్ళుచూ దొంగల చేతికి చిక్కి గాయపరచబడి, కొరప్రాణముతో విడిచిపెట్టబడ్డాడు. ఆ త్రోవలో యాజకుడు, లేవీయుడు అతని చూచి ప్రక్కగా వెళ్ళిపోయారు. ఒక సమరయుడు మాత్రము అతని చూచి దగ్గరకు వెళ్ళి, పరామర్శించి, గాయములను కట్టి, పూటకూళ్ళవాని ఇంట చేర్చి అతని ఆరోగ్యం కుదుటపడే వరకు శ్రద్ధ తీసుకున్నాడు. మనకి సహాయం చేసిన వారికి, పెట్టిన వారికి, వందనములు చేసినవారికే మనము సహాయము చేసేవారిగా, వందనములు చేసేవారిగా కాక మన పొరుగు వారి యొక్కయు, కృంగిన వారి యొక్కయు మనసులకు తగిలిన గాయములను కట్టుచూ, మంచి సమరయుడి వలె సమాజములో దేవుని ఎరిగిన ప్రత్యేకమైన బిడ్డలవలె జీవిద్ధాము !

(ఇంకా ఉంది)

# హోరేబు పర్వతము



హోరేబు పర్వతం బైబిలు గ్రంథములో దేవుని పర్వతముగా చెప్పబడుచున్నది. దీనిని హోరేబు లేక సీనాయి పర్వతములుగా కూడా చెప్పవచ్చును. బేర్షబాకు 400 కి.మీ దూరంగా, 3కి.మీ పొడవుతో, 1 1/2కి.మీ వెడల్పుతో దక్షిణంగా వ్యాపించి ఉన్న పర్వతశ్రేణులు. ఈ హోరేబు లేక సీనాయి పర్వతములలో అన్నిటికన్నా ఎత్తైన శిఖరం దాదాపు 2,160 మీటర్లు. దీని ఎదుట విశాలమైన మైదానం ఉన్నది. దాదాపు 20,00,000 మంది ప్రజలు ఈ ప్రాంతములో నివాసము చేయవచ్చును. ఈ పర్వతము మీదే దేవుడు మోషేని ఏర్పరచుకొని, ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించి, వారికి ధర్మశాస్త్రమును, పది ఆజ్ఞలను ఇచ్చారు.

**మోషే మిద్యాను యాజకుడైన యిత్రో అను తన మామ మందను మేపుచూ, ఆ మందను అరణ్యము అవతలకు తోలుకొని దేవుని పర్వతమైన హోరేబుకు వచ్చెను. నిర్గమ 3:1**

హోరేబు అను మాటకు వేడి లేదా వెలుగు అని అర్థము. ఈ పర్వతములోని పొదమధ్యలో నుండే దేవుడు అగ్నితో మోషేకి ప్రత్యక్షమై ఇది పరిశుద్ధ స్థలము అని చెప్పి, ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించవలసిందిగా నిన్ను కోరుకున్నాను అని చెప్పారు. ఈ మాట చొప్పున మోషే లోబడి, వారిని ఐగుప్తు నుండి విడిపించి, ప్రయాణమై వెళ్ళుచుండగా మార్గమధ్యంలో ఇశ్రాయేలు ప్రజలు నీటి కొరకు దేవుని మీద, మోషే మీద సణిగి నందున దేవుడు మరల ఈ హోరేబు పర్వత ప్రాంతములోని బండను కొట్టమని చెప్పి, దాని నుండి వచ్చిన నీళ్ళతో వారి దాహమును తీర్చెను.

తరువాత ఈ హోరేబు పర్వతం మీదికి మోషేను ఎక్కిరమ్మని యెహోవా చెప్పినప్పుడు మోషే వెళ్ళి 40 పగళ్ళు, రాత్రుళ్ళు ఈ కొండ మీద గడిపి, దేవుని వ్రేలితో వ్రాసిన శాసనములతో ఆయన ఆజ్ఞలు చెక్కబడిన రెండు రాతిపలకలు తీసుకొని క్రిందికి దిగెను. అప్పటికే ఇశ్రాయేలు ప్రజలు మరొక ప్రతిమను చేసుకొని సాగిలపడుచూ, నాట్యమాడుచూ ఉండగా మోషే వారి ప్రవర్తనను బట్టి తన చేతిలోని రాతి పలకలను పగలగొట్టెను. ఈ సంఘటనను బట్టి  వారు దేవుని కోపమునకు కారణమయ్యిరి. అప్పుడు ఇశ్రాయేలు ప్రజలు వారి ఆభరణములన్నిటిని ఈ కొండ వద్దనే తీసివేసి యెహోవా సన్నిధి వారితో ఉండాలని కోరుకున్నారు.

ఈ హోరేబు పర్వతము మీదే మోషేకి యెహోవా తన యొక్క మహిమ, ప్రకాశమును బండ సందులలో నుండి ప్రత్యక్షపరిచారు. మరల దేవుడు మోషేని మొదటి పలకల వంటి రాతి పలకలు రెండు చెక్కి, కొండ ఎక్కి ఉదయమునకు సిద్ధముగా ఉండమని చెప్పగా మరల మోషే 40 రాత్రింబగళ్ళూ యెహోవాతో కూడా ఉన్నాడు. భోజనం చెయ్యలేదు, నీరు త్రాగలేదు, పది ఆజ్ఞలు పలకల మీద వ్రాసి, కొండ దిగి వాటిని పట్టుకొని వెళ్ళినప్పుడు, అతని ముఖచర్మము ప్రకాశించింది గనుక ఇశ్రాయేలు ప్రజలు మోషే దగ్గరకు రావటానికి భయపడిరి.

**దేవుడు మోషేకి ధర్మశాస్త్రమును, పది ఆజ్ఞలను, నిర్గమకాండము 19-40 అధ్యాయాలు, లేవికాండము, సంఖ్యాకాండము మొదటి 10 అధ్యాయములను ఈ పర్వతము మీదే ఇచ్చారు.**




# బైబిల్ క్విజ్ -5

**1.** దేవుడు ఒక పట్టణమును నాశనము చేస్తాను అని చెప్పమని పంపిన ప్రవక్త ఎవరు? ఆ పట్టణము పేరేమిటి ?

**2.** యెహోవా నామమున ప్రార్థన చేయుట ఎప్పుడు ఆరంభమైనది ?

**3.** యెహోవా ఎదుట పరాక్రమము గల వేటగాడు ఎవరు ?

**4.** సోమరితనము చేత ఇంటి కప్పు, చేతుల బద్ధకముచేత ఇల్లు ఏమగును ?

**5.** చెట్టునకు మంచు ఉన్నట్లు నేనతనికుందును. తామర పుష్పము పెరుగునట్లు అతడు అభివృది నొందును - రిఫరెన్స్

**6.** దేవుడు నోవహును ఓడ దేనితో చేయమని చెప్పారు ?

**7.** గ్రంథమును ఆహారముగా తీసుకొని దానితో కడుపు నింపుకొనమని యెహోవా సెలవిచ్చిన ప్రవక్త ఎవరు ?

**8.** కన్నులు ఊడదీయించి బబులోనునకు కొనిపోయి మరణమగు వరకు చెరసాలలో ఉంచబడిన రాజు ఎవరు ?

**9.** యెహోవాకు పరిచర్య చేయు యాజకులు వేటికి మధ్య నిలువబడి కన్నీరు విడుచుచూ దేవుని వేడుకొనవలెను ?

**10.** యోసేపుకి ఫరోరాజు పెట్టిన పేరేమిటి ?

ఈ ప్రశ్నలకి సరైన రిఫరెన్సులతో సమాధానము జూలై 31వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానము వ్రాసిన వారి పేర్లు సెప్టెంబర్ పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా:- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

---

**<u>బైబిల్ క్విజ్-4 జవాబులు</u>**

**1.** షోమ్రోను, 5 రూపాయలు (2 రాజులు 6:25) **2.** మిఖాయేలు, అపవాదితో (యూదా పత్రిక 1:9)
**3.**మూఢత్వము (సామె 22:15) **4.**సామె 21:3 **5.**ఎస్తేరు, అహష్వరేషు (ఎస్తేరు 2:7)
**6.**యిర్మియా (యిర్మియా 7:16) **7.**రూతు **8.**యోబు భార్య (యోబు 2:9)
**9.**జెరెషు, 10 మంది (ఎస్తేరు 5:10, 9:7) **10.**గొల్గొతా (యోహాను19:17)

**<u>బైబిల్‌క్విజ్-4 ప్రశ్నలకు జవాబులు వ్రాసి పంపినవారి పేర్లు:</u>**

**1.** కె.సాల్మన్‌రాజు(భాగ్యలత) **2.** నయోమి సామ్యేల్ (భాగ్యలత).

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైనవారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !

**"నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక!"**

## జూలై - ఆగష్టు

**భాగ్యలత:** శారమ్మ, నిఖిల్(మిర్యాలగూడ), రమేష్‌బాబు, సాత్విక్, గంగాధర్, సురేష్, రూపస్, ప్రశాంత్ వర్మ, బుజ్జి, రాజేష్, ఎస్తేరు, దివ్య, రత్నం, రమ్య(మిర్యాలగూడ), ప్రభాకర్, ప్రసాద్, ప్రకాష్, విజయలక్ష్మి, నాంచారమ్మ, దివ్యవాణి, తరుణి, పాపారాణి, రాజేశ్వరరావు, వాణి, జ్యోతి, వీణ, శిరీష, జ్యోతి, సురేష్, ప్రసన్న, ప్రకాష్, భారతి, రమాదేవి, ఆనంద్‌రెడ్డి.

**చింతల్:** జీవన్, గణేష్, అఖిల, కోమలి, రవిబాబు, వెంకటేశ్వర్రావు, తేజ, శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వర్రావు, ప్రశాంతి, నాగాంజనేయులు, జస్వంతరావు, షైనీ, విజయ, సుధాకర్, శిల్ప, సోని, సుమంత్, ఆనంద్‌పాల్, పరిశుద్ధరావు, రాము, శివ, భగత్‌వర్మ, ప్రభాకర్, అజయ్‌కుమార్, వెంకటలక్ష్మి, శ్యామ్‌కుమార్, నాగరాజు, వీణ, కాలేబు, విజయ, దేవిక, సత్యం, దీవెన, నిరీక్షణ్, వెంకటరమణ, అరుణ్, శ్రీనివాస్.

**అనాజ్‌పూర్:** షాలేమురాజు, సిద్ధు, మణి, జ్యోతి, సౌజన్య, విజయలక్ష్మి.

**ఇ.సి.ఐ.ఎల్:** మాధవి, వెంకటేశ్వర్రావు, మాస్టర్ సుకుమార్.

# అన్నామణి

ఐర్లాండ్ దేశములోని మార్కెట్ హిల్ అను పట్టణమునకు సమీపమున నున్న బల్లమకల్లి అను మారు మూల గ్రామము నందు 1810వ సం॥లో అన్నామణి ఆరు మంది సంతానములో మూడవ దానిగా  జన్మించెను. ఈమె తండ్రి జేమ్స్‌ప్రెస్టన్. ఈయన పొలములో బంగాళదుంపలు పండించుచూ, పందుల మందను కాయుచు శక్తి వంచన లేకుండా ప్రయాసపడుచుండెడి వాడు. ఈమె నీమెమెక్ అను ఆమె ఇంట పని చేయుచూ, దైవభక్తి కలిగిన వారి సహవాసమును కలిగి ఉండెను. ఆర్మ్‌స్ట్రాంగ్ హాలిడే అను ప్రసంగీకుని ప్రసంగము ద్వారా జీవితమును మార్చుకొని, దేవుని కృప కొరకు ప్రార్థించెను. పిమ్మట దేవుని యొక్క సిలువ దర్శనము ద్వారా రక్షించబడి అనుభవ సాక్ష్యమును అందరితో పంచుకొను చుండెను. అక్షరములు కూడా రాని బలహీనురాలైన ఆమె దేవుని సహాయం ద్వారా మొట్టమొదటిగా బైబిలు చదివెను. శరీరమందును, మనస్సునందును, ఆత్మయందును పరిశుద్ధపరచబడుటకు అపేక్షను కలిగి, ముఖ్యముగా సులువుగా చిక్కుల బెట్టు పాపములైన కోపము, మత్సరము, క్రోధము వంటి వాటి నుండి జయించుటకు పోరాటమును కలిగి ఉండెను. ఈమె దేవుని వాక్యానుసారముగా జీవించుచూ ప్రతీ విషయమునకు దేవుని సహాయమును కోరుచూ ఉండెను.

అన్నామణి తన యౌవన కాలములో పరిశుద్ధముగా జీవించునట్లుగా ఆత్మ వలన శరీరమును లోపరుచుకొనెను. అనేక పర్యాయములు దుష్టులు ఆమె కన్యత్వమును దోచుకొనవలెనని ప్రయత్నించిననూ దేవదూతలు వచ్చి ఆమెను రక్షించినవా అన్నట్లు ఆమె తప్పించబడుచుండెను. ఈమె తన సాక్ష్యమును ప్రసంగముల కంటెను, తన జీవితము ద్వారా ఎక్కువగా బోధించెను.  ఈమె సంఘనాయకులకు, పాదుర్లకు సహాయకారిణియై వారిని పై మెట్టునకు లాగుచుండెను. ఈమె జీవితము వారికి సవాలుగా ఉండెను. 96 సం॥లు స్వార్థము లేకుండా జీవితాంతము వరకు పరిశుద్ధాత్మ దేవుని యొక్క నడిపింపును కలిగి, సంతోష, సమాధానములను, విజయమును జీవితములో అనుభవించెను.

అనేకుల బాధలలోనూ, సమస్యలలోనూ ఆదరణను కలుగజేసి, ఉన్నతమైన సేవ చేసి దీర్ఘకాలము జీవించి దేవుని బిడ్డల వలన సేవింపబడి జూన్ 21, 1906 వ సం॥లో మరణించింది. ఈమె యొక్క ఆత్మ వెలుగు తన చుట్టూ ఎన్నో మైళ్ళ వరకు వ్యాపించి సాతాను రాజ్యమును పడగొట్టెను.

ఈమె జీవితమును చూడగా ఎంత విద్యలేని వారైనను దేవునికి సంపూర్ణముగా అప్పగించుకొన్న యెడల బహు ఉన్నత పరిశుద్ధ సేవచేయ సామర్థ్యత దేవుడిచ్చెనని మనము చూచుచున్నాము. ఇది నిత్యజీవము నుండి వచ్చి నిలిచి యుండే సేవ.







దైవ సందేశముల వి.సి.డి లు కావలసిన వారు
క్రింది అడ్రసులో సంప్రదించగలరు.


# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070
Ph: 040-24202227 email: mail2church@gmail.com